మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు..




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

రైస్ మిల్లర్ల నిరవధిక సమ్మెపై డీఎంకు రిప్రజెంటేషన్




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 265 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 19 సెప్టెంబర్ 2026

# సిద్ధిపేటలో ఆక్రమించుకున్న భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మిస్తాం

- నూనూగు మీసాల కెటిఆర్ కొడుకుకి 40 ఎకరాల భూమి ఎలా వచ్చింది.
- అసైన్డ్ భూముల పట్టాదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టం
- కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సర్వే అనంతరం వాస్తవాలు వెల్లడిస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్:సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో భూములపై నెలకొన్న వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలంటే రికార్డులు, భౌతిక పరిస్థితి రెండింటినీ సమన్వయం చేయాల్సి ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రికార్డులో ఉన్న భూమి ఎంత? డాక్యుమెంట్లలో ఎంత? భౌతికంగా ఎవరి పొజిషన్‌లో ఎంత ఉంది? ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? అన్నది సమగ్ర సర్వే ద్వారా తేలుస్తాం. వాస్తవాలు బయటకు వచ్చిన తర్వాత చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా2లో...

### ప్రైవేట్ వర్సిటీలను లాభార్జన కోసం

# నిర్వహించకూడదు

## - ఆడిట్ ఖాతాలను సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రైవేట్ యూనివర్సిటీలను లాభం కోసం నిర్వహించ కూడదని సుప్రీం కోర్టు గురువారం తెలిపింది. ప్రజల విద్యా లక్ష్యాలను పూర్తి చేసే ఉద్దేశం వాటికి ఉండాలని పేర్కొంది. కేవలం లాభాలు సంపాదించుకొనే వ్యాపారంలా విద్యను చూసే సంస్థలను అనుమతించొద్దని ప్రభుత్వాలను కోరింది. అన్ని విశ్వవిద్యాలయాల ఆడిట్ చేసిన ఖాతాలను ఆరు వారాల్లోగా తమకు సమర్పిం చాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ను ఆదేశించింది. ఆ ఖాతాల్లో మిగులు ఆదా యం, వ్యయం, వసూలు చేసిన రుసుముల వివరాలు ఉండాలని స్పష్టం చేసింది. అమిటీ యూనివర్సిటీ కాలేజీ రికార్డుల్లో తన పేరు మార్చుకోవాలని ప్రయత్నించిన ఓ విద్యార్థిని తనను యాజమాన్యం వేధించిందని దాఖలు చేసిన కేసులో కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

# వాళ్లలాగా నేను కబ్జాలు పెట్టలేదు: హరీష్ రావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** అన్ని ఎన్నికల అఫిడవిట్లలో తన భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పానని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. సర్వే నెంబర్లతో సహా భూముల వివరాలు ఇచ్చానని, కాంగ్రెస్ వాళ్లు సిద్ధిపేటకు వస్తున్నారని, తన భూములు చూసి పోతారని, వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ బండ్లు. రోప్ పార్టీలు ఎందుకు, డ్రోన్లు పెట్టీ ఫోటోలు తీయడం ఎందుకు అని ప్రశ్నించారు. సిద్ధిపేటలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. తాను ఇక్కడే ఉన్న తనకు చెబితే అన్ని ఏర్పాటు చేస్తానని, మంచిగా కడుపు నిండ అన్నం తినిపించి దగ్గరుండి కంటి నిండా తోట అన్నీ చూపిస్తానన్నారు. కాకుంటే ఉన్నది ఉన్నట్లు చెప్పండని, అబద్ధాలు చెప్పకండని తన జీవితం తెరిచిన పుస్తకం అని తెలియజేశారు. రామంచలలో 13 ఎకరాలు ఉంటే లేని పోనీవి చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను దాచింది ఏముంది కాంగ్రెసోళ్లు కొత్తగా బయట పెట్టేది ఏముందని అడిగారు. కాంగ్రెస్ నాయకులు లాగా తాను కబ్జాలు పెట్టలేదని, ప్రజల మిగతా2లో...

### తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

# నిరవధిక వాయిదా..

**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎనిమిది రోజుల పాటు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 51 గంటల 52 నిమిషాల పాటు కొనసాగిన సభలో ప్రశ్నలు, చర్చలు, సభ్యుల ప్రసంగాలు, మిగతా2లో...





# సమన్వయంతో పని చేయాలి

**ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణపై సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ ఏడాది డిసెంబర్ 11 నుంచి 22 వరకు హైదరాబాద్ సహా హన్మకొండ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం వేదికగా జరుగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను (అండర్-18) సమన్వయంతో మిగతా2లో...

# రైతులు, మిల్లర్ల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలకంగా ముందడుగు వేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మిల్లర్ల ప్రతినిధులతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సానుకూల వాతావరణంలో జరిగిన చర్చల్లో మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా చూస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల ప్రయోజనాలు.. ప్రజాధనం పరిరక్షణతో పాటు మిల్లింగ్ రంగం స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. మిల్లర్లపై అనవసర భారం మోపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.మిల్లర్లు సమర్పించిన వినతులను సానుకూలంగా మిగతా2లో...

# 'ప్రజాస్వామ్యం' కన్నీరు తుడిచిన హైకోర్టు!..

- ప్రజా ప్రాతినిధ్య చట్టంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు
- స్పీకర్ ట్రిబ్యునల్ నిర్ణయానికి భిన్నంగా హైకోర్టు తీర్పు
- ఎమ్మెల్యేల పార్టీ మార్పులపై కీలక సంకేతాలు
- తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో మార్పులకు అవకాశం




**హైదరాబాద్, 18(పిసిడబ్ల్యూ న్యూస్):** పార్టీ ఫిరాయింపుల అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థలో ఓటర్ల తీర్పుకు ఉన్న ప్రాధాన్యత, రాజ్యాంగ విలువల పరిరక్షణపై ఈ తీర్పు మరోసారి దృష్టిని కేంద్రీకరించింది. పార్టీ గుర్తుపై గెలిచి అనంతరం మరో పార్టీలోకి వెళ్లే ఎమ్మెల్యేల విషయంలో న్యాయస్థానాల జోక్యం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. **ఫిరాయింపుల రాజకీయానికి హెచ్చరిక సంకేతం** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ మార్పులు కొత్త విషయం మిగతా2లో...

# ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల




**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఆర్టీసీలో కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఎన్నికలు నిర్వహించి, 17న ఫలితాలు వెల్లడించనున్నట్టు అధికారులు తెలిపారు. 2016 జులై 19న ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా.. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి.

**ఎన్నికల పూర్తి షెడ్యూల్ వివరాలు**

సెప్టెంబర్ 21 (సోమవారం): పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న యూనియన్లు సమ్మతి పత్రాలను సమర్పించడం. సెప్టెంబర్ 22 (మంగళవారం): ఆయా డిపో మేనేజర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సంబంధిత జిల్లాల డిప్యూటీ రిటర్నింగ్ అధికారులకు అందజేయడం, యూనియన్ల నుంచి అభ్యంతరాలు కోరడం. సెప్టెంబర్ 24 (గురువారం): ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు ఆఖరి తేదీ. సెప్టెంబర్ 25 (శుక్రవారం): సంబంధిత డిపో మేనేజర్లు/యూనిట్ అధికారులతో చర్చించి అభ్యంతరాలను పరిష్కరించి తుది రూపు ఇవ్వడం. సెప్టెంబర్ 26 (శనివారం): పోటీ చేసే మిగతా2లో...



# ఈ నెల 28 నుంచి బంగారు ఉంగరం పథకం

**తమిళనాడు, సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సెప్టెంబర్ 28న నవజాత శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. తొలి విడత పంపిణీ కోసం 1.28 లక్షల బంగారు ఉంగరాలను ప్రభుత్వం మిగతా2లో...

# ప్రపంచం చూపు హైదరాబాద్ వైపు

## - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచం హైదరాబాద్ వైపుచూస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఈమేరకు ఎక్స్ వేదికలో సీఎం పేర్కొన్నారు. కేవలం పెట్టుబడులు, వ్యాపారం కోసమే కాదు... ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞానం, నైపుణ్యాలు, ప్రతిభ, ఆవిష్కరణలు, ఆలోచనల కోసమని అభిప్రాయపడ్డారు. గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఎగ్జిక్యూటివ్ విద్య, పరిశోధన, ప్రపంచ నైపుణ్యాలు, పరిశ్రమలు, విద్యాసంస్థల సహకారం వంటి రంగాలలో భాగస్వామ్యాలను మరింత పటిష్టం చేసుకునేందుకు, తాను యూకేలోని ప్రముఖ బిజినెస్ స్కూల్స్, విశ్వవిద్యాలయాల ప్రతినిధి బృందంతో సమావేశమైన విషయాన్ని ప్రస్తావించారు. డిసెంబర్ నుంచి హార్వర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. అదే సమయంలో ఎంఐటీ, పర్డ్యూ, యూనివర్సిటీ ఆఫ్ లండన్, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలతో కూడా సహకారాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భారత్‌ఫ్యూచర్‌సిటీ ఈ దార్శనికతను మరింత ముందుకు తీసుకువెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తుకు అవసరమైన ప్రపంచ స్థాయి విద్యా కేంద్రం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రపంచ స్థాయి కంపెనీలు, అత్యాధునిక పరిశోధన ఒకచోట అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచమే నేర్చుకునేలా, ఆవిష్కరణలు చేసేలా, పెట్టుబడులు పెట్టేందుకు అనువైన ప్రదేశంగా మార్చుతామని పేర్కొన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు...2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.

# సిద్ధిపేటలో ఆక్రమించుకున్న భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మిస్తాం


(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి , తాను మాట్లాడే ప్రతి అంశానికి డాక్యుమెంట్లు, అధికారిక రికార్డులు ఉన్నాయని, సర్వే పూర్తయిన తర్వాత సాంకేతిక ఆధారాలతో వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు. భూముల విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టదని, అయితే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, భౌతిక స్వాధీనం, రెవెన్యూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లలో చూపిన ఆస్తుల మధ్య తేడాలు ఉంటే వాటిని రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిందేనని అన్నారుకేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సమగ్ర సర్వే కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఉన్న భూముల విషయంలో స్థానికుల నుంచి వచ్చిన సమాచారాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన కూడా స్థానికుల నుంచి వచ్చిన సమాచారంపై ఆధారపడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు సర్వేలో తేలితే, చట్టప్రకారం ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అర్హులైన పేదలకు, ముఖ్యంగా దళితులకు ఉపయోగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. 2004 అఫిడవిట్‌లో భూములు లేవని చెప్పి.. ఇప్పుడు వందల ఎకరాలు ఎలా? అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ భూములపై జరుగుతున్న చర్చలో ఎన్నికల అఫిడవిట్లలో నమోదైన వివరాలు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. 2004 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో కెసిఆర్ తన పేరున వ్యవసాయ భూమి లేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు తర్వాత కాలంలో విస్తారమైన భూములు ఎలా వచ్చాయి? పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వాములమని చెబుతున్నప్పుడు, ఆ భూముల వివరాలు సంబంధిత ఎన్నికల అఫిడవిట్లలో ఎందుకు కనిపించలేదు? అని మంత్రి ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రస్తుత వాదనలు, అప్పటి అఫిడవిట్ల వివరాల మధ్య ఉన్న తేడాలను రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సి ఉందన్నారు. కెటిఆర్ కొడుకు పేరిట 40 ఎకరాల భూమిపై స్పందిస్తూ నూనూగు మీసాల పిల్లోడు ఏ వ్యాపారం చేశాడని ఇంత భూమి వచ్చిందని మంత్రి ప్రశ్నించారు. హరీశ్‌రావు అఫిడవిట్‌పైనా ప్రశ్నలు హరీశ్‌రావు తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన భూములు, ప్రస్తుతం ఉన్న భూములు, భౌతిక స్వాధీనం, ట్రస్ట్ పేర్లతో ఉన్న భూములు తదితర అంశాలను కూడా పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. అఫిడవిట్‌లో ఎంత చూపించారు? రికార్డుల్లో ఎంత ఉంది? భౌతికంగా ఎంత ఉంది? బినామీ పేర్లలో ఏమైనా ఉందా? అన్నది అధికారిక రికార్డుల ఆధారంగా తేలాలని అన్నారు. అఫిడవిట్‌లో చూపిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమి ఉన్నట్లు తేలితే దాని చట్టబద్ధతను పరిశీలిస్తామని చెప్పారు. ఒక గుంట తేడా ఉన్నా అది ఎవరి పేరున, ఏ హక్కుతో ఉందో రికార్డుల ద్వారా తేలాలని అన్నారు. హరీశ్‌రావు కుటుంబ సభ్యులు మాజీ సైనికుడి నుంచి భూములు కొనుగోలు చేశారన్న వాదనపై కూడా మంత్రి స్పందించారు. భూమి లావాదేవీ జరిగితే దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, పట్టా, ఇతర చట్టబద్ధమైన డాక్యుమెంట్లు ఉండాలి. ఆ డాక్యుమెంట్లు, వాటి వెనుక ఉన్న రికార్డులు ఏమిటో పరిశీలిస్తాం" అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల పేర్లతో జరిగిన భూ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను కూడా అధికారికంగా పరిశీలిస్తామని చెప్పారు. ఏదైనా పత్రం తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నట్లు తేలితే, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిద్ధిపేట ప్రాంతంలో భూ అక్రమాలను వెలికి తీసి అక్కడ ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని వివరించారు. రైతులకు అండగా ప్రజాప్రభుత్వం అసైన్డ్ భూములకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని మంత్రి తెలిపారు. అసైన్డ్ భూముల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన అసైన్డ్ భూములపై ఒరిజినల్ పట్టాలు ఉన్నవారిని ఇబ్బంది పెట్టబోమని స్పష్టం చేశారు. పట్టాలు కలిగిన అసైన్డ్ భూములను లాక్కునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. ఈ మేరకు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ముందుగా అసైన్డ్ భూముల పూర్తి వివరాలను తేల్చి, ఆ తర్వాత పక్కనే ఉన్న భూములపై అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రంగనాయకసాగర్ భూముల వ్యవహారంపై రికార్డుల పరిశీలన రంగనాయకసాగర్ పరిసర భూముల విషయంలో అప్పటి ఇరిగేషన్ శాఖ రికార్డులు, ఎఫ్‌టిఎల్ , బఫర్ జోన్, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించాల్సి ఉందని మంత్రి తెలిపారు. అప్పటి పరిస్థితుల్లో సంబంధిత భూములపై శాఖల మధ్య జరిగిన లేఖాచారాలు, భూముల వర్గీకరణలో మార్పులు, రిజిస్ట్రేషన్ జరిగిన విధానం, రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ నిధులు వినియోగించారా లేదా వంటి అంశాలపై పూర్తి వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఇరిగేషన్ శాఖ ఎంత భూమి అవసరమని కోరింది? తర్వాత ఆ భూమి రికార్డుల్లో ఏ మార్పులు జరిగాయి? ఎంత మొత్తానికి రిజిస్ట్రేషన్ జరిగింది? అన్నది డాక్యుమెంట్ల ద్వారా తేలాలని మంత్రి అన్నారు. వట్టినాగులపల్లి భూమిపై వివరణ 'వట్టినాగులపల్లి భూమికి తనకు ప్రత్యక్ష యాజమాన్య సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆ భూమి నాది కాదు. డెవలప్‌మెంట్ కోసం తీసుకున్నాం. నేను రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో ఉన్నాను. నా ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వాల సమయంలోనే వచ్చాయి. అదే ప్రభుత్వాలు వాటిని నిలిపివేసిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. నేను మంత్రి అయిన తర్వాత తన కుమారుడు వ్యాపారంలోకి రాలేదని, కుటుంబ సభ్యులను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరైంది కాదని మంత్రి అన్నారు.

# 'ప్రజాస్వామ్యం' కన్నీరు తుడిచిన హైకోర్టు!..

(మొదటి పేజీ తరువాయి)

కాకపోయినా.. వాటిపై చర్యల విషయంలో చాలాకాలంగా చర్చ కొనసాగుతోంది. అధికార సమీకరణాల్లో భాగంగా ఎమ్మెల్యేలను ఆకర్షించడం, ప్రతిపక్ష బలాన్ని తగ్గించడం వంటి రాజకీయ వ్యూహాలు గతంలోనూ కనిపించాయి. అయితే ప్రజల ఓట్లతో గెలిచిన ప్రతినిధులు పార్టీ మారినప్పుడు రాజీనామా చేసి తిరిగి ప్రజా తీర్పు కోరాలనే డిమాండ్ కూడా తరచూ వినిపించింది. తాజా పరిణామాలు పార్టీ ఫిరాయింపులపై రాజకీయ పార్టీల్లోనూ, ప్రజల్లోనూ కొత్త చర్చకు కారణమయ్యాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో భవిష్యత్‌లో తీసుకునే నిర్ణయాలపై ఆసక్తి నెలకొంది. **రెండు పార్టీల మధ్య ఇరుక్కున్న నేతలు** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కొందరు ఎమ్మెల్యేల రాజకీయ పరిస్థితిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. పార్టీ మారిన తర్వాత ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం, అభివృద్ధి పనులు, రాజకీయ గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తి కొందరు నేతల్లో వ్యక్తమవుతోందని కథనం పేర్కొంటోంది. పార్టీ మారే సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, నియోజకవర్గాల్లో ఎదురవుతున్న సమస్యలు, స్థానిక రాజకీయ ఒత్తిళ్లు నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఫలితంగా కొందరు నేతలు తిరిగి పాత రాజకీయ వేదిక వైపు చూస్తున్నారనే చర్చ కూడా సాగుతోంది. **అధికార పార్టీలోనూ అసంతృప్తి స్వరాలు** కొత్తగా చేరిన ఎమ్మెల్యేలకు పార్టీలో సమన్వయం, పదవులు, ప్రాధాన్యత వంటి అంశాల్లో ఎదురవుతున్న సమస్యలు అసంతృప్తికి కారణమవుతున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై బహిరంగంగా స్పందించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. రాజకీయాల్లో పార్టీ మార్పు అనేది కేవలం అధికార సమీకరణాలకు మాత్రమే పరిమితం కాకుండా.. వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతుందనే అంశం తాజా పరిణామాలతో మరోసారి తెరపైకి వచ్చింది. **భవిష్యత్ అడుగులపై ఉత్కంఠ** హైకోర్టు తీర్పు తర్వాత ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్ కార్యాచరణపై ఆసక్తి నెలకొంది. న్యాయపరమైన పరిణామాలు, నియోజకవర్గాల్లో ప్రజాభిప్రాయం, ఆయా పార్టీల వైఖరి ఆధారంగా వారి రాజకీయ ప్రయాణం ఏ దిశగా సాగుతుందనేది కీలకంగా మారింది. పార్టీ మార్పులు తాత్కాలిక రాజకీయ లాభాలను అందించినా.. దీర్ఘకాలంలో ప్రజల విశ్వాసం, రాజకీయ స్థిరత్వం, స్థానిక బలంపై ప్రభావం చూపుతాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.




# మా ఆస్తులు తీసుకొని రూ.వెయ్యి కోట్లు ఇవ్వు: కేటీఆర్

**హైదరాబాద్ :సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** మా ఆస్తులు తీసుకొని రూ.వెయ్యి కోట్లు ఇస్తే చాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన విలేకర్లతో మాట్లాడుతూ.. 'కేసీఆర్ వెయ్యి ఎకరాలు దోచుకున్నారని రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారం చేశారు. ఇటీవల అసెంబ్లీలో 67 ఎకరాలే ఉన్నాయన్నారు. రూ.వెయ్యి కోట్లు ఇస్తే మీరు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతా. మిగిలిన 99వేల కోట్లతో పథకాలు అమలుచేయండి' అని కేటీఆర్ అన్నారు.

# ఈ నెల 28 నుంచి బంగారు ఉంగరం పథకం

(మొదటి పేజీ తరువాయి)

సమీకరించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆసుపత్రుల్లో జన్మించే శిశువులందరికీ ఈ ఉంగరాలను అందించనున్నట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది.

ప్రతి బంగారు ఉంగరానికి ప్రత్యేక సీరియల్ నంబర్ ఉంటుంది. అలాగే ఉంగరాలను ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్‌లో అందించనున్నారు. ఈ పథకం ప్రయోజనం పొందాలంటే లబ్ధిదారులు తమిళనాడు శాశ్వత నివాసితులై ఉండాలి అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సమన్వయంతో పని చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పని చేసి విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. క్రీడాశాఖ ముఖ్య ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో కలిసి సంజయ్ జాజు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 'జాతీయ క్రీడల తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన టోర్నమెంట్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి క్రీడలను విజయవంతం చేయాలని' సంజయ్ జాజు తెలిపారు.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రకటనలు, బిల్లుల ఆమోదంతో కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. అలాగే సభ ముందుకు వచ్చిన నాలుగు బిల్లులకూ ఆమోదం లభించింది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రభుత్వ హామీల అమలును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులు, నినాదాలు ఉన్న నల్ల టీషర్టులతో అసెంబ్లీకి చేరుకున్నారు. వారిని పోలీసులు అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. సమావేశాల్లో నాలుగు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. ఇక 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం పార్టీల బలాబలాల విషయానికి వస్తే.. కాంగ్రెస్‌కు 66 మంది, బీఆర్ఎస్‌కు 37 మంది, బీజేపీకి 8 మంది, ఎంఐఎంకు 7 మంది, సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు.

# రైతులు, మిల్లర్ల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించి సాధ్యమైన పరిష్కారాలను చూపుతామని మంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సరఫరాలపై అధికారులతో ప్రత్యేకంగా కసరత్తు చేయాలని సూచించినట్లు చెప్పారు. సమస్యలపై మరోసారి నాలుగైదు రోజుల్లో మిల్లర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరిస్తామని ఉత్తమ్ అన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రజాధనం, మిల్లింగ్ రంగం స్థిరత్వం మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేస్తూ.. ప్రస్తుతం కొనసాగుతున్న సమ్మెను విరమించి ప్రభుత్వంతో చర్చలకు సహకరించాలని మిల్లర్లకు విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

యూనియన్లకు తుది ఓటర్ల జాబితా పంపిణీ, పోటీలో ఉండే యూనియన్లకు గుర్తుల కేటాయింపు, జిల్లాల డీసీఎల్లు తుది ఓటర్ల జాబితాను ప్రధాన రిటర్నింగ్ అధికారికి సమర్పించడం. సెప్టెంబర్ 29 (మంగళవారం): పోటీ చేసే యూనియన్లు నమూనా బ్యాలెట్ పత్రాలను డీసీఎల్ వద్ద నుంచి సేకరించడం. అక్టోబర్ 09 (శుక్రవారం): పోలింగ్ తేదీ (ఉదయం 5:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు). అక్టోబర్ 14 ఁ 15: పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ. అక్టోబర్ 17 (శనివారం): ఫలితాల ప్రకటనగుర్తింపు ఇలా ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికే ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

# వాళ్లలాగా నేను కబ్జాలు పెట్టలేదు: హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము దోచుకోలేదన్నారు. సిద్దిపేట ప్రజలు తన పని చూసి ఏడు సార్లు గెలిపించారని, తనని దీవించారని, కాంగ్రెస్ వాళ్లు అంత భయపడాల్సిన అవసరం లేదని, మా సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయతకు, ఆతిథ్యానికి చిరునామా అని ప్రశంసించారు. సిద్దిపేటకు ఎవరు వచ్చినా కడుపునిండా అన్నం పెడతాం, ప్రేమగా మాట్లాడుతానని హరీష్ రావు పేర్కొన్నారు. అంత మంది పోలీసులు పెట్టుకొని భయపడుకుంటూ రావాల్సిన అవసరం కాంగ్రెస్ వాళ్లకు లేదన్నారు.

# మసీదులో ఆత్మాహుతి దాడి..15 మంది మృతి



**హైదరాబాద్ :సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కోహాట్ జిల్లాలో శుక్రవారం ప్రార్థనల సమయంలో ఒక మసీదులో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 15 మంది మృతి చెందగా, 30 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి మసీదు గోడ కూలిపోయింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జమ్మికుంటలో ఘనంగా పెరియార్ 147వ జయంతి

**జమ్మికుంట, సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట పట్టణంలో ప్రజా సంఘాలు, మేధావుల ఆధ్వర్యంలో సామాజిక సంస్కర్త పెరియార్ ఈవీ రామసామి 147వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సహచర హాస్పిటల్‌లో పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా సామాజిక విశ్లేషకులు మాట్లాడుతూ.. పెరియార్ తన జీవితాంతం సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, మహిళా విముక్తి, కుల వివక్ష నిర్మూలన వంటి అంశాలపై నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. కుల వ్యవస్థలోని అణచివేతకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం, బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్ల కోసం, తమిళ భాషాసంస్కృతి పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చారిత్రక ప్రాధాన్యత కలిగిందన్నారు.సామాజిక



అంశాలను విశ్లేషించడంలో పెరియార్ తాత్విక దృక్పథాన్ని, ప్రజలను ఉద్యమాల వైపు నడిపించడంలో ఆయన పోరాట స్వభావాన్ని వారు గుర్తుచేశారు. పెరియార్‌పై తమిళేతర ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్న పలు అభిప్రాయాలను చారిత్రక ఆధారాలతో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమిళనాడులో ఆయన ప్రభావాన్ని వివిధ సామాజిక వర్గాల దృష్టికోణంలో పరిశీలించడం అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయ కులు డాక్టర్ ఎస్. తిరుపతయ్య, విద్యా వేత్త డాక్టర్ పుల్లూరి సంపత్, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపకులు, కవి వాగ్గేయకారులు రామంచ భరత్, బీఎస్పీ సీనియర్ నాయకులు మారేపల్లి మొగిలయ్య, డాక్టర్ అంబాల ప్రభాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు ఎస్. అచ్యుత్ కుమార్, ఉపాధ్యాయులు ఆవాల నరహరి, మారముల ప్రభు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు..

### ఫార్మసిస్టుల బాధ్యతకు భరోసా..
### ప్రిస్క్రిప్షన్ మందుల విక్రయాలపై నిఘా

**ములుగు జిల్లా సెప్టెంబర్18(పిసిడబ్ల్యూ న్యూస్):** మెడికల్ షాపుల్లో మందుల విక్రయాలపై మరింత నిఘా పెంచేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక ప్రతిపాదన చేసింది. ప్రిస్క్రిప్షన్ మందుల విక్రయాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలోకి తీసుకురావాలని ప్రతిపాదిస్తూ డ్రగ్స్ రూల్స్, 1945లో మార్పులకు సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ప్రతిపాదనలో భాగంగా రిటైల్ మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రికార్డుల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను సూచించారు.**మందుల విక్రయాల్లో పారదర్శకతకు చర్యలు** మెడికల్ షాపుల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా విక్రయించే మందులపై నియంత్రణను మరింత పటిష్ఠం చేయడమే ప్రతిపాదన ఉద్దేశంగా పేర్కొన్నారు. ముఖ్యంగా షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ కేటగిరీలకు చెందిన మందుల అనధికార విక్రయాలను అరికట్టేందుకు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రతిపాదించారు. ఔషధాల విక్రయాలు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా



లేదా అనే విషయాన్ని పరిశీలించేందుకు సీసీ కెమెరాల వ్యవస్థ ఉపయోగపడనుంది. **మూడు నెలల పాటు సీసీ కెమెరాల రికార్డులు**ముసాయిదా ప్రతిపాదన ప్రకారం రిటైల్ మెడికల్ షాపుల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాల రికార్డులను కనీసం మూడు నెలల పాటు భద్రపరచాల్సి ఉంటుంది. ఈ నిబంధన అమలులోకి వస్తే మందుల విక్రయాలకు సంబంధించిన వ్యవహారాలను అవసరమైన సందర్భాల్లో పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. **ఫార్మసిస్టుల బాధ్యత మరింత కీలకం** మెడికల్ షాపుల్లో మందుల విక్రయాల సమయంలో రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల బాధ్యత కీలకంగా ఉంటుంది. వైద్యుల సూచనల మేరకు మందులు అందించడం, విక్రయాల రికార్డులను నిర్వహించడం, ఔషధ నిబంధనలను పాటించడం వంటి అంశాల్లో ఫార్మసిస్టులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. సీసీ కెమెరాల పర్యవేక్షణతో మందుల విక్రయాల్లో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఔషధ సేవలు అందేలా చర్యలు బలోపేతం కావచ్చని భావిస్తున్నారు. **ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం** ప్రిస్క్రిప్షన్ మందుల అనధికార విక్రయాలను నియంత్రించడం, మందుల దుర్వినియోగాన్ని అరికట్టడం, మెడికల్ షాపుల్లో నిబంధనల అమలును పటిష్ఠం చేయడం ఈ ప్రతిపాదన ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ముసాయిదాపై సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలను స్వీకరించనుంది. ప్రతిపాదనపై తుది నిర్ణయం అనంతరం నిబంధనల అమలుపై స్పష్టత రానుంది.

# నాగారంలో చేనేత వృత్తికి పునరుజ్జీవం

### జంపకాన తయారీకి నూతన గుంట మగ్గాల ఏర్పాటుకు భూమిపూజ

**పరకాల, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):**నాగారం గ్రామంలో చేనేత వృత్తికి పునరుజ్జీవం కల్పించే దిశగా అడుగు పడింది. చేనేత కార్మికులకు తిరిగి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నాగారం చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో కార్పెట్లు (జంపకాన) తయారు చేసేందుకు నూతన గుంట మగ్గాల ఏర్పాటు పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు.నాగారం చేనేత సహకార సంఘం చైర్మన్ దాసరి బిక్షపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంలో చాలాకాలంగా చేనేత వృత్తి మందగించడంతో అనేక మంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారని, మగ్గాలను పునఃప్రారంభిం చడం ద్వారా వారికి తిరిగి పని కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ చేనేత వృత్తిని పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధికి అండగా నిలవడమే లక్ష్యమని పేర్కొన్నా రు.కార్యక్రమానికి వెంకటేశ్వర్లపల్లి చేనేత సహకార సంఘం చైర్మన్ గోనె రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగారం పద్మశాలి సేవా సంఘం



అధ్యక్షుడు మెండు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు, సంఘం డైరెక్టర్ మోతె రఘుపతి, డైరెక్టర్లు వావిలాల రాజసమ్మయ్య, సామల మహేందర్, దాసరి రాజమణి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.నాగారంలో



చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు స్థానిక చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించేందుకు సహకార సంఘం కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా అనంతుల రమేష్ నియామకం

### డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం చేతుల మీదుగా నియామక పత్రం అందజేత
### వెలిచాల రాజేందర్ రావును కలిసి ఆశీస్సులు తీసుకున్న రమేష్

**కరీంనగర్, టౌన్ సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అనంతుల రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం శుక్రవారం నగరంలోని క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన డిసిసి అధ్యక్షునితోపాటు కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వెలిచాల




రాజేందర్ రావుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ...నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జిల్లా మంత్రులకు, ముఖ్య నేతలకు, ప్రజా ప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు వాస్తవాలతో తిప్పికొడతానని, కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు నా వంతు కృషి చేస్తూ, నూతన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తాను అని అన్నారు.

# రైస్ మిల్లర్ల నిరవధిక సమ్మెపై డీఎంకు రిప్రజెంటేషన్



**ములుగు, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. సమ్మె కొనసాగుతున్న విషయాన్ని జిల్లా ఇండస్ట్రీస్ డీఎం సిద్ధార్థరెడ్డికి తెలియజేస్తూ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు రిప్రజెంటేషన్ అందజేశారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు సమ్మెలో పాల్గొంటున్నారని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని వారు కోరారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, కార్యదర్శి సహోదర్ రెడ్డి, కోశాధికారి ఎలగ ందుల మోహన్, ఉపాధ్యక్షుడు అక్కల రఘోత్తం, జిల్లాలోని పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయంలో కేటగిరీ మార్పుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ములుగు జిల్లా, సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రీయ విద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి బాలవాటిక – 2 ప్రవేశ ప్రక్రియలో ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థిని ఎస్టీ కేటగిరీలో నమోదు చేసి లాటరీలో పరిగణించారని ఆరోపిస్తూ పసులాది ముఖేష్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.తన కుమారుడు పసులాది విహాన్ స్వేరో బాలవాటిక2 ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారని,దరఖాస్తు సంఖ్య బీవీ287 అని తెలిపారు. విద్యార్థి ఎస్సీ కేటగిరీకి చెందినప్పటికీ, ప్రవేశ రికార్డులో ఎస్టీ కేటగిరీగా నమోదు చేసినట్లు కనిపిస్తోందన్నారు. ఎస్టీ కేటగిరీలో నిర్వహించిన లాటరీలో విద్యార్థికి 12వ సంఖ్య వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ కేటగిరీ నమోదు కారణంగా విద్యార్థి తన అసలు ఎస్సీ కేటగిరీలో పరిగణించబడలేదనే సందేహం ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసి సంబంధిత అంశాన్ని పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు.విద్యార్థి దరఖాస్తు, కేటగిరీ నమోదు వివరాలు,లాటరీ ప్రక్రియను పరిశీలించి తప్పిదం జరిగినట్లు తేలితే నిబంధనల ప్రకారం సరిదిద్ది, విద్యార్థికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు పసులాది ముఖేష్ తెలిపారు.

# దానం నాగేందర్‌పై హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్‌కు చెంపపెట్టు: బీఆర్ఎస్ నేత ఎం.డి. జానీ



**ములుగు, సెప్టెంబర్ 18:(పిసిడబ్ల్యూ న్యూస్):** దానం నాగేందర్ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ నేత ఎం.డి. జానీ అన్నారు. ఒక పార్టీ గుర్తుపై పోటీ చేసి ప్రజల ఓట్లతో గెలిచిన అనంతరం మరో రాజకీయ పార్టీలోకి వెళ్లడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, ఓటర్ల విశ్వాసానికి విరుద్ధమని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఒక పార్టీపై, ఆ పార్టీ అభ్యర్థిపై నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తారని, ఆ తర్వాత ప్రజల తీర్పును పక్కనపెట్టి పార్టీ మారితే తనను గెలిపించిన ఓటర్లకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. "ఒక పార్టీ గుర్తుపై గెలిచి.. మరో పార్టీలో చేరడం సరైన రాజకీయ పద్ధతి కాదు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉంది. పార్టీ మారాలనే నిర్ణయం తీసుకుంటే ముందుగా పదవికి రాజీనామా చేసి తిరిగి ప్రజల ముందుకు వెళ్లి వారి తీర్పు కోరాలి. ప్రజల ఓట్లతో వచ్చిన పదవిని కొనసాగిస్తూ రాజకీయ పార్టీ మార్చడం ఓటర్ల విశ్వాసాన్ని అవమానపరచడమే" అని ఎం.డి. జానీ అన్నారు. దానం నాగేందర్ అనర్హతకు సంబంధించి హైకోర్టు తీర్పు ప్రజా తీర్పు విలువ, ప్రజాప్రతినిధుల బాధ్యత, పార్టీ ఫిరాయింపుల అంశంపై మరోసారి చర్చకు దారితీసిందని పేర్కొన్నారు. ప్రజలు ఏ పార్టీకి ఓటు వేసి గెలిపించారో ఆ ప్రజా తీర్పును గౌరవించాలని, రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ మారే ముందు ప్రజల విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. హైకోర్టు తీర్పును బీఆర్ఎస్ స్వాగతిస్తోందని, ప్రజా తీర్పు ప్రాధాన్యతను కాపాడే దిశగా ఈ పరిణామాన్ని చూస్తున్నామని ఎం.డి. జానీ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి తీర్పును గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో గోవిందరావుపేట తహసీల్దార్

- భూమి మార్పిడికి రూ.14 వేలు డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు




**ములుగు,(గోవిందారావుపేట) సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** భూమి మార్పిడి కోసం రూ.14 వేల లంచం తీసుకుంటున్న గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.లంచం డిమాండ్ చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు దాడి చేపట్టారు.లంచం తీసుకుంటున్న సమయంలో తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు కార్యాలయంలో సోదాలు,తనిఖీలు నిర్వహించారు.లంచం ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించారు.ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ.. భూమి మార్పిడి కోసం తహసీల్దార్ సృజన్‌కుమార్ డబ్బులు డిమాండ్ చేశారంటూ ఫిర్యాదు అందిందని తెలిపారు.పక్కా సమాచారంతో దాడి చేసి రూ.14 వేల లంచం తీసుకుంటున్న సమయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు.తదుపరి తహసీల్దార్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

# యువతకు రాజకీయ అవకాశం ఎప్పుడొస్తుంది?

**ప్రచారానికి యువత.. పోరాటాలకు యువత..**
**మరి నాయకత్వానికి ఎందుకు కాదు?**

**"యువతే భవిష్యత్తు" అనే మాటలు ఎన్నికల వేళ నిర్ణయాలుగా మారుతాయా?**

**బెల్లి జగదీష్ యాదవ్, అడ్వకేట్**

**ములుగు: సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** "యువతే దేశానికి వెన్నెముక.. యువతే భవిష్యత్తు.. యువతే రేపటి నాయకత్వం".. రాజకీయ వేదిక ఏదైనా ఈ మాటలు వినిపిస్తూనే ఉంటాయి. యువతను ప్రోత్సహిస్తామని, కొత్త తరం నాయకత్వాన్ని తయారు చేస్తామని పార్టీలు చెబుతుంటాయి. కానీ అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే..**యువతపై నిజంగా నమ్మకం ఉంటే.. ఆ నమ్మకం రాజకీయ అవకాశాల్లో ఎందుకు కనిపించదు?** ఎన్నికలు వచ్చినప్పుడు ప్రచార వాహనాలపై ముందుండేది యువతే. ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగేది యువతే. సభలకు జనాన్ని సమీకరించేది యువతే. సోషల్ మీడియాలో పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది యువతే. రోడ్లపై నిరసనలు, ధర్నాలు, పోరాటాల్లో ముందుండేది కూడా యువతే.అయితే ఎన్నికల్లో ప్రజల ముందుకు అభ్యర్థిగా నిలబడే అవకాశం వచ్చినప్పుడు మాత్రం యువత వెనక్కి ఎందుకు వెళ్లాలి? **జెండా మోసే చేతులు.. నాయకత్వం ఎందుకు కాదు?**రాజకీయ పార్టీలకు కార్యకర్తలు అవసరం. అందులో యువత కీలకం. కానీ యువతను కేవలం జెండాలు మోసే శక్తిగా, నినాదాలు చేసే గొంతుగా, ప్రచారం నిర్వహించే బలంగా మాత్రమే చూడటం సరిపోతుందా?యువతలో నాయకత్వ సామర్థ్యం ఉంటే దాన్ని గుర్తించాలి. ప్రజల్లో తిరుగుతున్నారా? ప్రజా సమస్యలపై స్పందిస్తున్నారా? పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నారా? ప్రజలతో సంబంధం ఉందా? నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉందా? ఇవన్నీ పరిశీలించి ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీలపై కూడా ఉంది.యువతను ఉపయోగించుకోవడం ఒకటి.. యువతను నాయకత్వంగా తీర్చిదిద్దడం మరొకటి.**"అనుభవం లేదు" అనే మాటకు ముగింపు ఎప్పుడు?** యువతకు టికెట్ ఇవ్వాలంటే అనుభవం కావాలని అంటారు. కానీ అనుభవం ఎలా వస్తుందిఅవకాశం లేకుండా అనుభవం వస్తుందా?బాధ్యత ఇవ్వకుండా నాయకత్వం తయారవుతుందా?పోటీకి నిలబెట్టకుండా ప్రజల్లో ఎవరి సామర్థ్యం తెలుస్తుంది?అనుభవం పేరుతో ప్రతి ఎన్నికలో పాత ముఖాలకే అవకాశం ఇస్తే.. కొత్త నాయకత్వం ఎప్పుడు ఎదుగుతుంది? యువతకు చిన్నస్థాయి బాధ్యతలు, సంస్థాగత పదవులు, ప్రజా సమస్యలపై పనిచేసే అవకాశాలు, నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించినప్పుడే భవిష్యత్ నాయకత్వం తయారవుతుంది. **టికెట్ హక్కు కాదు.. కానీ అవకాశం మాత్రం కావాలి** ప్రతి యువకుడికి ఎన్నికల టికెట్ ఇవ్వాలనే నిబంధన లేదు. టికెట్ అనేది రాజకీయ పార్టీల నిర్ణయం. గెలుపు అవకాశాలు, ప్రజాదరణ, సామాజిక సమీకరణాలు, పార్టీ బలం వంటి అనేక అంశాలను పార్టీలు పరిగణనలోకి తీసుకుంటాయి. **అయితే అదే సమయంలో..ప్రజల్లో పనిచేసిన యువతను కేవలం కార్యకర్తగా మాత్రమే చూడాలా?** ప్రజా సమస్యలపై సంవత్సరాలుగా పోరాడుతున్న యువకుడి సామర్థ్యాన్ని పరిశీలించకూడదా? పార్టీ కోసం సమయం, శ్రమ, శక్తిని పెట్టిన యువ నాయకత్వానికి ఒక దశలో ప్రత్యక్ష రాజకీయ అవకాశం ఇవ్వకూడదా? **ఇదే అసలు చర్చ** యువత కూడా ప్రశ్నించాలి.. తమను తాము కూడా ప్రశ్నించుకోవాలి.అవకాశం కావాలని కోరే యువత కూడా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.ప్రజల కోసం నేను ఏం చేశాను?నా ప్రాంతంలోని



సమస్యలు నాకు తెలుసా? ప్రజలు నన్ను ఎందుకు నమ్మాలి?పదవి లేకపోయినా ప్రజల మధ్య ఉన్నానా?ఎన్నికలు లేనప్పుడు కూడా ప్రజలకు అందుబాటులో ఉన్నానా?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగిన యువతే నాయకత్వ అవకాశాలను కోరే నైతిక బలాన్ని సంపాదించగలదు. **ఐదేళ్లు ప్రజలతో ఉంటే.. ఎన్నికల సమయంలో గుర్తింపు అవసరం ఉండదు** ఎన్నికలకు ఆరు నెలలు ముందు ప్రజల మధ్య కనిపించడం రాజకీయ నాయకత్వానికి సరిపోదు. ప్రజా సమస్య వచ్చినప్పుడు ముందుకు రావాలి. విద్య, ఉపాధి, రైతులు, యువత, రోడ్లు, తాగునీరు, ఆరోగ్యం వంటి స్థానిక సమస్యలపై నిరంతరం స్పందించాలి.ఎన్నికల కోసం ప్రజల వద్దకు వెళ్లే యువత కాదు.. ప్రజల కోసం ఎన్నికలను ఎదురుచూడని యువత కావాలి.అలాంటి నాయకత్వం ప్రజల్లో ఏర్పడితే.. టికెట్ కోసం పార్టీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రజలే తమ నాయకత్వాన్ని గుర్తించే పరిస్థితి ఏర్పడుతుంది. **పార్టీలకు ఇది కూడా ఒక పరీక్షే** యువతను సభలకు తీసుకురావడం సులభం. కానీ నిర్ణయాలు తీసుకునే టేబుల్ వద్ద కూర్చోబెట్టడం అసలు పరీక్ష.యువతను "భవిష్యత్తు" అని పిలవడం సులభం. కానీ ఆ భవిష్యత్తుకు నేటి నుంచే బాధ్యతలు అప్పగించడం మాత్రం రాజకీయ సంకల్పాన్ని కోరుతుంది.కొత్త నాయకత్వం రావాలంటే కొత్తవారికి అవకాశం ఇవ్వాలి. అవకాశం ఇచ్చినవారిలో సామర్థ్యం ఉన్నవారిని గుర్తించాలి. సామర్థ్యం ఉన్నవారికి బాధ్యతలు పెంచాలి. ఇదే సహజమైన నాయకత్వ వికాస ప్రక్రియ. చివరికి ప్రశ్న యువతదే కాదు.. పార్టీలదీ యువతను కేవలం ప్రచార బలంగా చూస్తారా? లేక రాజకీయ నాయకత్వంగా తీర్చిదిద్దుతారా? జెండాలు పట్టే చేతులకు బాధ్యతలు ఇస్తారా? నినాదాలు చేసే గొంతులకు నిర్ణయాల్లో స్థానం కల్పిస్తారా? ప్రజల కోసం పోరాడే యువతను ప్రజాప్రతినిధులుగా నిలబడే స్థాయికి తీసుకెళ్తారా? "యువతే భవిష్యత్తు" అని చెప్పడం ఇక సరిపోదు.

ఆ భవిష్యత్తుకు వర్తమాన ంలోనే ఎంత స్థానం ఇస్తున్నారన్నదే అసలు ప్రశ్న.రాజకీయాల్లో తరాల మార్పు మాటల్లో కాదు.. అవకాశాల్లో కనిపించాలి. యు వతను ప్రోత్సహిస్తున్నామని చెప్పే ప్రతి రాజకీయ పార్టీకి ఇదొక ప్రశ్న.అవకాశం కోసం ఎదురుచూస్తున్న ప్రతి యువకుడికి ఇదొక సవాలు. **యువతకు జెండా ఇచ్చే రాజకీయాలు కావాలా?** లేక జెండాతో పాటు నాయకత్వ బాధ్యత కూడా ఇచ్చే రాజకీయాలు కావాలా?సమాధానం ఎన్నికల వేళ తీసుకునే నిర్ణయాల్లోనే కనిపించాలి.

## సర్పంచ్ మోయిజ్‌ను అభినందించిన గౌస్ ఆలం..





**రామడుగు, 18 సెప్టెంబర్ (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలోని వినాయక మండపం విఠలేశ్వర ఆలయం ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ సి పి గౌస్ అలం సదర్శించారు . సిపి గౌస్ ఆలం మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ గ్రామంలో అన్ని పండగలుఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరిస్తున్న సర్పంచ్ మోయిస్ ను సిపి గౌస్ ఆలం అభినందించారు. గ్రామంలో ప్రజల మధ్య ఐక్యత సోదర భావం పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపి విజయ్ కుమార్ సిఐ ప్రదీప్ కుమార్ ఎస్సై కే రాజు గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## అశోక్ నగర్ వినాయకుని దర్శించుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్..

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్రమంత్రి , మేయర్ , డిప్యూటీ మేయర్..**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ వినాయక మండపాన్ని శుక్రవారం రోజున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర, దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ గొట్టేముక్కుల ఉమారాణి వెంకటరమణ వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు కేంద్ర మంత్రి బండి సంజయ్, మేయర్, డిప్యూటీ మేయర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. నగరంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, వైభవంగా జరిగేలా నిర్వాహకులు తీసుకుంటున్న ఏర్పాట్లను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వినాయక కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## గుండ్లపల్లి - పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం బీజేపీ నిరంతర పోరాటం..

**అసెంబ్లీలో గళమెత్తిన**
**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ....**
**ఎన్నికల సమయంలో 100**
**రోజుల్లో పూర్తి చేస్తామన్న హామీ..**
**రెండున్నర ఏళ్లుగా దారుణంగా**
**మారిన రోడ్డు పరిస్థితి**
**రోడ్డు బాగు కోసం బీజేపీ ఆధ్వర్యంలో**
**నిరంతర ఆందోళనలు, నిరసనలు..**
**ఇటీవల నిరసన కార్యక్రమం సందర్భంగా**
**సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలని డిమాండ్**
**చేసిన బీజేపీ మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేష్**
**సమస్యపై స్పందించి అసెంబ్లీలో మాట్లాడిన**
**మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,**
**తక్షణ నిధులు మంజూరు చేసి పనులు**
**పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**




**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని గుండ్లపల్లి – పొత్తూరు రెండు వరుసల (టూ–లేన్) రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గత రెండున్నర ఏళ్లుగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో సాగుతున్న పోరాటం ఫలితంగా ఇప్పుడు ఈ అంశం అసెంబ్లీ వేదికగా ప్రధాన చర్చకు వచ్చింది.గత ఎన్నికల సమయంలో గుండ్లపల్లి – పొత్తూరు రోడ్డును కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. అయితే, కాలం గడుస్తున్నా పనులు ముందుకు పడకపోవడంతో రోడ్డు పూర్తిగా అధ్వానంగా, గుంతలమయంగా తయారైంది. దీనివల్ల ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**బీజేపీ ఆధ్వర్యంలో హోరెత్తిన నిరసనలు** ప్రజల పక్షాన నిలిచిన బీజేపీ నాయకులు ఈ సమస్యపై గత రెండున్నర ఏళ్లుగా నిరసనలు, ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఇటీవల బీజేపీ మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో మరోసారి నిరసన కార్యక్రమం చేపట్టి, రోడ్డు దుస్థితిని వెంటనే అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేకవ్వంపల్లి సత్యనారాయణ నుడిమాండ్ చేశారు.బీజేపీ శ్రేణుల నిరసనలు, ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వ0పల్లి సత్యనారాయణ ఎట్టకేలకు ఈ రోడ్డు సమస్యను శాసనసభలో ప్రస్తావించారు. గుండ్లపల్లి – పొత్తూరు రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి ఎమ్మెల్యే దిగివచ్చి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడం సంతోషకరమన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారి అస్తవ్యస్తంగా, నరకయాతనగా మారిన గుండ్లపల్లి– పొత్తూర్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని , ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## గతం కంటే ఘనంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాలు..

**- రూ.1.50 కోట్లతో భారీ ఏర్పాట్లు..**
**విద్యుత్ కాంతులతో నగరం ముస్తాబు**

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో ఈసారి గణేశ్ నిమజ్జన ఉత్సవాలను గతం కంటే మరింత ఘనంగా నిర్వహించేందుకు నగర పాలక సంస్థ ఏర్పాట్లు చేపట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన బండి సంజయ్ కుమార్ వివిధ గణేశ్ మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్సవాలను ఘనంగా, ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.ఈసారి నిమజ్జన ఉత్సవాల కోసం నగర పాలక సంస్థ గతేడాది కంటే భారీగా రూ.1.50 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.



నగరంలోని ప్రధాన కూడళ్లు, నిమజ్జన మార్గాలను విద్యుత్ దీపాలు, పూల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. భక్తులకు మంచినీరు, ప్రసాదాల సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనానికి తరలివెళ్లే గణనాథుల వాహనాలకు ఇబ్బందులు లేకుండా రోడ్లపై గుంతలను గుర్తించి ప్యాచ్‌వర్క్ పనులు చేపడుతున్నారు.మరోవైపు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తొలిసారిగా గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచింది. ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.

## ఫార్ములా ఈ కేసు పేరుతో కేటీఆర్‌ను ఇంకెన్ని రోజులు వేధిస్తారు?: భూక్య జంపన్న




**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫార్ములా ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన నేపథ్యంలో, కేసు పేరుతో ఆయనను ఇంకా ఎన్నిరోజులు ఇబ్బందులకు గురిచేస్తారని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న ప్రశ్నించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణను ఈ–మొబిలిటీ, ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో ముందంజలో నిలబెట్టాలనే లక్ష్యంతో అప్పటి మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఫార్ములా ఈ రేస్ నిర్వహించారని తెలిపారు. అంతర్జాతీయ మోటార్‌స్పోర్ట్స్ ఈవెంట్ల ద్వారా పెట్టుబడులు, పర్యాటకం, టెక్నాలజీ, నగర బ్రాండ్ ఇమేజ్ పెరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ కేసులో ఏదైనా తప్పు జరిగిందని ప్రభుత్వం భావిస్తే, న్యాయస్థానంలో ఆధారాలతో నిరూపించాలని, న్యాయ ప్రక్రియను గౌరవించాలని జంపన్న అన్నారు. కేసులను రాజకీయ ప్రచారానికి ఉపయోగించకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. తెలంగాణకు పరిశ్రమలు, పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు, కొత్త టెక్నాలజీ అవసరమని, కేసుల రాజకీయాల కంటే అభివృద్ధికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని భూక్య జంపన్న డిమాండ్ చేశారు.

## నిరుపేద కుటుంబానికి అండగా సర్పంచ్

**- పెరమళ్ళ సమ్మయ్య దహన సంస్కారాలకు కట్టెలు దానం**



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్ 13వ వార్డుకు చెందిన నిరుపేద కుటుంబానికి సర్పంచ్ కాకులవారి శ్రీలత లక్ష్మణరావు అండగా నిలిచారు. అదే వార్డుకు చెందిన పెరమళ్ళ సమ్మయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆర్థిక ఇబ్బందులతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలుసుకున్న వార్డు సభ్యురాలు అక్షయ వెంటనే సర్పంచ్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కాకులవారి శ్రీలత లక్ష్మణరావు స్పందించి, మానవతా దృక్పథంతో పెరమళ్ళ సమ్మయ్య అంత్యక్రియలకు అవసరమైన కట్టెలను దానం చేశారు. నిరుపేద కుటుంబానికి కష్ట సమయంలో అండగా నిలిచి దహన సంస్కారాలకు సహకారం అందించడం పట్ల స్థానికులు సర్పంచ్‌ను అభినందించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా తన వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని సర్పంచ్ శ్రీలత లక్ష్మణరావు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఆపద సమయంలో ఆర్థిక పరిస్థితులను పట్టించుకోకుండా స్పందించి దహన సంస్కారాలకు అవసరమైన కట్టెలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు ఇలాంటి మానవతా సేవా కార్యక్రమాలకు ముందుకు రావడం ద్వారా పేద కుటుంబాలకు ఎంతో భరోసా కలుగుతుందని అన్నారు.

## పొన్నాల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మహా గణనాథుని నిమజ్జన యాత్ర

**- దుర్గా నగర్‌లో భక్తిశ్రద్ధలతో కొనసాగిన నిమజ్జన వేడుకలు**

**- ముఖ్య అతిథులుగా హాజరైన వివిధ పార్టీల నాయకులు, బహుజన ఉద్యమ నేతలు**



**ఉప్పల్, సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** దుర్గా నగర్‌లో పొన్నాల లలిత (ఎక్స్ వార్డు మెంబర్) ఆధ్వర్యంలో మహా గణనాథుని నిమజ్జన యాత్రను ఘనంగా నిర్వహించారు. పొన్నాల మహేందర్ ఆధ్వర్యంలో సాగిన యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తుల సందడితో దుర్గా నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంద కార్తిక్ మాట్లాడుతూ, గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేశపాక రామచందర్, ఎంఎస్పీ జాతీయ నాయకులు, మేడ్చల్ ఇన్‌చార్జి కొరాపాక అంజి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇటుక కిషన్, హైదరాబాద్ ఇన్‌చార్జి, మల్లికార్జున్ గౌడ్,టేకులపల్లి రామచందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,దళిత రత్న అవార్డు గ్రహీతలు సీనియర్ జర్నలిస్టులు ఏళ్ల సంతోష్ కుమార్, ఇడపాక సురేష్, సీనియర్ జర్నలిస్టులు ఎం చిరంజీవి, శివ అద్వైత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జెండా ఆవిష్కరణ, వందేమాతరం సామూహిక గానం




**హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, వందేమాతరం 150వ వార్షికోత్సవం పురస్కరించుకుని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్ గోపిశెట్టి ప్రమోద్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు



ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ, వందేమాతరం సామూహిక గానం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ల్యాండ్‌మార్క్ 18, జేకేఎం అవెన్యూ, మాతృశ్రీ అపార్ట్‌మెంట్, గాంధీ కుటీర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో సమితి సభ్యులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద ప్రత్యేకంగా జెండా ఆవిష్కరణ చేసి, వందేమాతరం పూర్తి గీతాన్ని సామూహికంగా ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజీయూఎస్ ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ కె. నర్సింగ్ గౌడ్, అసెంబ్లీ కో–కన్వీనర్ గోపి, డివిజన్ కన్వీనర్ గోపిశెట్టి ప్రమోద్, డివిజన్ కో–కన్వీనర్లు ధీరేందర్ బియానీ, మల్లికార్జున్, మహేష్, సంతోష్‌లతో పాటు సమితి సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సులభంగా.. వేగంగా.. విద్యుత్ బిల్లుల చెల్లింపు

**సమయం, కాలం ఆదా...**

**ఫోన్‌కు నెల వారి బిల్లుల సమాచారం**

**లైన్‌లో నిలబడి చెల్లించే విధానానికి స్వస్తి**

**డిజిటల్ విధానానికి ప్రోత్సాహం. అనవసర అపరాధ రుసుములు ఉండవు**

**ఏటా దాదాపు 10 శాతం మేర పెరుగుతున్న ఆన్‌లైన్ చెల్లింపులు**

**ములుగు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.బిక్షపతి**




**ములుగు జిల్లా సెప్టెంబర్18(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యుత్ వినియోగదారులు బిల్లులను సులభంగా, వేగంగా, ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా చెల్లించేందుకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) డిజిటల్ చెల్లింపు విధానాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చిందని .. ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.బిక్షపతి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వినియోగదారులు ఇంటి వద్ద నుంచే తమ విద్యుత్ బిల్లులను చెల్లించే సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని చెప్పారు. వినియోగదారులు గతంలో విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం బిల్ కలెక్షన్ కేంద్రాలకు వెళ్లి, క్యూలో నిలబడి బిల్లులు చెల్లించాల్సి వచ్చేదని, ప్రస్తుతం డిజిటల్ చెల్లింపు విధానంతో ఆ ఇబ్బందులకు పూర్తిగా స్వస్తి పలికారనిచెప్పారు. వివిధ యాప్‌ల ద్వారా చెల్లింపులు ప్రస్తుత సాంకేతిక యుగంలో డిజిటల్ చెల్లింపులు ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మారాయని అన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్ తదితర డిజిటల్ చెల్లింపు యాప్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ యాప్ ల ద్వారా వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ నుంచే రెండు నిమిషాల్లో విద్యుత్ బిల్లును చెల్లించవచ్చన్నారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ పరిధిలోని వివిధ బ్యాంకింగ్ యాప్‌ల ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించే సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. దీంతో వినియోగదారులు తమకు అనుకూలమైన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఎంచుకుని బిల్లులను సులభంగా చెల్లించవచ్చని ఎస్ఈ వివరించారు. **టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా మరింత సులభంగా**వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్ లో టీజీఎన్పీడీసియల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యుత్ బిల్లుకు సంబంధించిన ఖుజ నంబర్‌ను నమోదు చేసుకోని, ప్రతి నెలా విద్యుత్ బిల్లును సులభంగా చెల్లించడంతో పాటు బిల్లు వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. డిజిటల్ విధానంలో బిల్లులు చెల్లించడం వల్ల ప్రతి నెలా చెల్లించాల్సిన మొత్తం, బిల్లు వివరాలపై ముందస్తు సమాచారం పొందే అవకాశం ఉంటుంది. అలాగే చెల్లింపుల వివరాలు డిజిటల్‌గా నమోదవడం వల్ల అకౌంటింగ్ ప్రక్రియలో పారదర్శకత, భద్రత పెరుగుతాయని పేర్కొన్నారు. **ఏటేటా పెరుగుతున్న డిజిటల్ చెల్లింపులు** టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లులు చెల్లించే వినియోగదారుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. గణాంకాల ప్రకారం. ములుగు సర్కిల్‌లో 202526 ఆర్థిక సంవత్సరంలో 88465 మంది వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించారు. 202627 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 97188 మందికి పెరిగింది. విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలకు వెళ్లి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకపోవడంతో సమయం, ప్రయాణ వ్యయం, శ్రమ ఆదా అవుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, దూర ప్రాంతాల్లో నివసించే వినియోగదారులకు డిజిటల్ చెల్లింపు విధానం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులో అందుబాటులో ఉన్న డిజిటల్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని సురక్షితంగా, సులభంగా, సకాలంలో బిల్లులు చెల్లించాలని వినియోగదారులను ఎస్ఈ కోరారు.

## మోడల్ యూఎన్ విద్యార్థులకు ఒక పరివర్తనాత్మక అనుభవం

**- ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల**



**హైదరాబాద్, సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** నాయకత్వ లక్షణాలు, ప్రపంచ అవగాహన, మరియు జీవితానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడనికి మోడల్ యునైటెడ్ నేషన్స్ ( ఏంయూఎన్) విద్యార్థులకు ఒక పరివర్తనాత్మక అనుభవం అందిస్తుందని ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల తెలిపారు. హైదరాబాద్ నగర శివార్లలోని గుండ్లపోచంపల్లి, డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ క్యాంపస్ లో శుక్రవారం నగరంలోని వివిధ స్కూళ్ల విద్యార్థులకు ప్రపంచ సమస్యలపై అవగాహన, విధాన రూపకల్పన, సామాజిక భాగస్వామ్యం, మెరుగైన ప్రపంచం కోసం డీ.ఆర్.ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ "మోడల్ యునైటెడ్ నేషన్స్ ( ఏంయూఎన్) 2026 ను నిర్వహించింది. అవినాష్ కొల్ల ఏంయూఎన్–2026 ను ప్రారంభించి మాట్లాడుతూ మోడల్ యుఎన్ విద్యార్థులను తమను తాము ప్రపంచ సమాజంలో భాగంగా భావించేలా ప్రోత్సహిస్తుందని, భిన్న సంస్కృతుల పట్ల అవగాహన, సానుభూతి మరియు బాధ్యతాయుత భావనలను పెంపొందించడం ద్వారా, తమకు ముఖ్యమైన అంశాలపై చర్చలు చేపట్టేలా మరియు స్థానిక, ప్రపంచ స్థాయిలలో మార్పు తీసుకురాగల తమ శక్తిని గుర్తించేలా విద్యార్థులను ప్రేరేపిస్తుందని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న యునైటెడ్ డిప్లొమాటిక్ కౌన్సిల్ డైరెక్టర్ మనీష్ పత్తిపాటి మాట్లాడుతూ మోడల్ యునైటెడ్ నేషన్స్ అనేది ఒక ప్రయాణం అని, ఇది విద్యార్థులు వ్యక్తిగతంగా మరియు మేధోపరంగా ఎదగడానికి,



విద్యార్థులు తమ కోసం తాము వాదించుకోవడం, తమ ఆలోచనలను సమర్థించుకోవడం, అలాగే ప్రపంచం గురించి విమర్శనాత్మకంగా ఆలోచించడం నేర్చుకుంటారని తెలిపారు. డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ డైరెక్టర్ డా. అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ సంబంధాలు, రాజకీయ శాస్త్రం లేదా న్యాయశాస్త్రంపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు, మోడల్ యుఎన్ వారి భవిష్యత్ వృత్తి మార్గాలను నేరుగా ప్రభావితం చేయగల అంశాలు, మార్గదర్శకులు మరియు సంబంధాలను అందిస్తుందని, చాలా మంది పూర్వ విద్యార్థులు తమ ఏంయూఎన్ అనుభవాల నుండి ప్రేరణ పొంది, దౌత్యం, ప్రభుత్వం, న్యాయం మరియు లాభాపేక్షలేని సంస్థల వంటి రంగాలలో విజయవంతమైన వృత్తిని కొనసాగిస్తున్నారని తెలిపారు. డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ ప్రిన్సిపాల్ ఐ. వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ, ఐక్యరాజ్యసమితి సూత్రాల గురించి మరియు అది ఎలా పనిచేస్తుందో మరింతగా తెలుసుకోవడానికి డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ ప్రతియేటా మోడల్ యుఎన్ నిర్వహిస్తుందని, ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలోని దాదాపు 15 స్కూళ్ల నుండి 300 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.ఎస్.ఐ.ఎస్ డైరెక్టర్లు గర్వ్ అగర్వాల్, సృష్టి అగర్వాల్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, ఏంయూఎన్–2026 అధ్యక్షులు మేరీ తనూజ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు, నవజాత శిశువుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం!

**హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జి. ప్రవీణ్ కుమార్, డాక్టర్ శతాబ్ది గిరి**




**హనుమకొండ:సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ ఉమ్మడి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా చిన్న పిల్లల తల్లిదండ్రుల కోసం ఒక అద్భుతమైన అవకాశం అందుబాటులోకి వచ్చిందని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ వైద్యులు జి. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్‌నియోనాటాలజిస్ట్, డాక్టర్ శతాబ్ది గిరి కార్డియాలజిస్ట్ తెలిపారు. నవజాత శిశువులు, చిన్నారుల ఆరోగ్య సమస్యల నివారణార్థం ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను అందించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు గురువారం రోజున హనుమకొండలోని యశోద క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వివరించారు. ఈ వైద్య శిబిరంలో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని వైద్య సలహాలు, సంప్రదింపులు అందించనున్నారు. ప్రతి నెల మూడవ గురువారం రోజున హనుమకొండ లో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైద్యులు కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, జి. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్,డాక్టర్ శతాబ్ది గిరి వైద్యులు అందుబాటులో ఉంటారు. ఈ క్రింది సెల్ నెంబర్లను 9618328673, 9247565105సంప్రదించగలరు. నవజాత శిశువుల సమస్యలు, నెలలు నిండకుండా పుట్టడం (ప్రీమెచ్యూరిటీ), పుట్టుకతో వచ్చే శ్వాసకోశ సమస్యలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువుల సంరక్షణపై ప్రత్యేక వైద్య సలహాలు, పిల్లల గుండె సంబంధిత సమస్యలు, చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, ఇతర కార్డియాక్ సమస్యల నిర్ధారణ, నిపుణులైన కార్డియాలజిస్ట్ చేత వైద్య సేవలు పొందవచ్చునని వారు తెలిపారు. వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ పిల్లల ఆరోగ్య భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సిబ్బంది వికె రెడ్డి, చంద్రకాంత్, మహేష్, విజయ్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మట్టి గణపతికి పూజలు..

### ఘనంగా మహా అన్నదానం
### ఏటూరునాగారం బస్టాండ్ ఆవరణలో
### సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో
### అన్నదాన కార్యక్రమం







**ములుగు జిల్లా ఏటూరునాగారం, సెప్టెంబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి స్వామివారి సన్నిధిలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమం ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. **ముఖ్య అతిథులుగా పోలీసు అధికారులు**మట్టి గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బస్టాండ్ ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏటూరునాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్య ప్రకాష్ గారు, ఎస్సై బి. మహేష్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తి, సేవాభావంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వారు అభినందించారు. **ప్రముఖులు, కమిటీ సభ్యుల హాజరు** ఈ మహా అన్నదాన కార్యక్రమంలో ములుగు జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న గారు, ఆత్మ చైర్మన్ చిటమట రఘు గారు, అర్చకులు ఎల్లాప్రగడ రాధాకృష్ణ గారు పాల్గొన్నారు. సేవా యువజన సంఘం యూత్ అధ్యక్షులు లింగాచారి గారి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండారి లక్కీ గారు, కోశాధికారి గణేష్ గారు, సలహాదారులు కందుకూరి సుధాకర్ గారు, బిల్ల సత్యనారాయణ గారు, గుర్రపు నరేష్ గారు,కిరణ్ కుమార్ గారు పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు నూతి లక్ష్మణ్ బాబు, నూతి వినయ్ కుమార్, సాంబ, ప్రశాంత్ తదితర యూత్ సభ్యులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. **భక్తులకు అన్నప్రసాద వితరణ**మట్టి గణపతి స్వామివారి సన్నిధిలో పూజలు పూర్తయిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. సేవా యువజన సంఘం సభ్యులు భక్తులకు ఆప్యాయంగా భోజనాలు వడ్డిస్తూ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు, యువత, స్థానిక ప్రజలు ఉత్సాహంగా హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని నిర్వాహకులు తెలిపారు.ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంలో సేవా యువజన సంఘం సభ్యులు చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.మట్టి గణపతి స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# 13వ వార్డులో పెన్షన్ల వెరిఫికేషన్

### • ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిశీలన




**ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఆకులవారి గణపురం గ్రామపంచాయతీ పరిధిలోని 13వ వార్డులో పెన్షన్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా 13వ వార్డు సభ్యురాలు ఆవుల అక్షయ, ఆవుల లక్ష్మీనారాయణ తదితరుల సమక్షంలో లబ్ధిదారుల వివరాలు, అర్హతకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. పెన్షన్ పొందుతున్న వారి వివరాలను నమోదు చేసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా లబ్ధిదారుల నుంచి అవసరమైన వివరాలను సేకరించి, సంబంధిత రికార్డులతో పరిశీలించారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి బొడ్రాయి వద్ద ఘనంగా వినాయకుడి అన్నదానం

### - 300 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ





**మల్లంపల్లి, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూన్యూస్):** గ్రామంలోని బొడ్రాయి సెంటర్ వద్ద ప్రతిష్ఠించిన శ్రీ వినాయకుడి ఉత్సవాల సందర్భంగా “మన ఊరుమన బాధ్యత” గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పూజా కార్యక్రమాల అనంతరం అన్నదానంలో గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు సహా సుమారు 300 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు క్రమశిక్షణతో భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఉత్సవాలను కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, సమాజహితం కోసం అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న “మన ఊరుమన బాధ్యత” యువజన బృందాన్ని స్థానిక పెద్దలు, గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దలను వదలి.. పేదల ఇళ్లకే నోటీసులా..?

### - శ్రీనివాసనగర్ లో పేదల ఇళ్ల తొలగింపు నోటీసులను ఉపసంహరించాలి
### - కాలుష్య టింబర్ డిపోలను జనావాసాలకు దూరంగా తరలించాలి
### - సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్






**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** “రెక్కాడితే గానీ డొక్కాడని పేదల గూళ్లకే నోటీసులా..? కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన పెద్దల వైపు అధికారులు ఎందుకు కన్నెత్తి చూడటం లేదు..?” అంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదల ఇళ్లను తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేసి, శ్రీనివాసనగర్ వాసులకు ఇచ్చిన తొలగింపు నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.శ్రీనివాసనగర్‌లో పేదల ఇళ్లకు తొలగింపు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఐ నాయకులు ఆ ప్రాంతంలో పర్యటించారు. పేదల ఇళ్లకు వెళ్లి వారి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అక్కడే నివాసముంటున్న కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ... శ్రీనివాస్‌నగర్‌లో సుమారు 50 ఏళ్లుగా పేద కుటుంబాలు చిన్నచిన్న గూళ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం జీవో నెం.58 కింద అనేక ఇళ్లను క్రమబద్ధీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పేదల ఇళ్లకు తొలగింపు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.“కూలి చేసుకుంటేనే కుటుంబాన్ని పోషించుకునే పేదలు ఉన్నత న్యాయస్థానాల వరకు వెళ్లి న్యాయపోరాటం చేయగలరా? వారి కష్టాన్ని, కన్నీటిని అధికారులు అర్థం చేసుకోవాలి” అని అన్నారు. పేదలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే వారి నివాసాలను తొలగించేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు.ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో అధికారుల వైఖరి ఒకేలా లేదని సురేష్ ఆరోపించారు. ఎన్నెస్పీ కాలువలను ఆక్రమించుకున్న అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. రోటరీనగర్ ప్రాంతంలో లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై నివేదికలు, న్యాయస్థానాల ఆదేశాలు ఉన్నప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు.“పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయం అనే పరిస్థితి ఉండకూడదన్నారు. చట్టం ముందు అందరూ సమానమే. పేదల గూళ్లను కూల్చడం కాకుండా వారి జీవన భద్రతకు ప్రభుత్వం భరోసా కల్పించాలి” అని దండి సురేష్ అన్నారు.మరోవైపు త్రీటౌన్ ప్రాంతంలోని జనావాసాల మధ్య కొనసాగుతున్న టింబర్ డిపోల వల్ల స్థానిక ప్రజలు కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. కలప కోత, దుమ్ము, వ్యర్థాల కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.కాలుష్యాన్ని కలిగిస్తున్న టింబర్ డిపోలను జనావాసాలకు దూరంగా తరలించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లపై నోటీసులు ఇవ్వడంలో చూపుతున్న వేగాన్ని ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలోనూ చూపాలని సూచించారు.పేదల ఇళ్లను తొలగిస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని, వారి హక్కుల కోసం పోరాటం చేస్తామని దండి సురేష్ హెచ్చరించారు. టింబర్ డిపోలను తరలించడంపై అధికారులు వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, నాయకులు సైదా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన హుదా హైస్కూల్ లీజు వివాదం..

### అసదుద్దీన్ ఒవైసీ చొరవతో ఇరువర్గాలను సమన్వయ పర్చిన గులాం అహ్మద్




**కరీంనగర్, సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** గత రెండు సంవత్సరాల నుంచి వివాదంలో కొనసాగుతున్న నగరంలోని ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థ హుధా హై స్కూల్ వివాదం ఎంఐఎం పార్టీ నేతల చొరవతో ముగిసింది. ఎంఐఎం పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ చొరవతో కరీంనగర్ ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ నేతృత్వంలో స్కూలు యాజమాన్యాన్ని బిల్డింగ్ యాజమాన్యాన్ని ఇద్దరినీ సమన్వయపరిచారు. ఇరు వర్గాలు ఒప్పుకొని రాజీ కుదరడంతో లీజు అగ్రిమెంట్ ను రాబోయే 2039 వరకు అనగా 13 సంవత్సరాల పాటు నిరాటంకంగా కొనసాగేందుకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కరీంనగర్ లో అగ్రిమెంట్ లీజు డీడ్ ను చేసుకున్నారు. దీంతో 800వందల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కాకుండా వారి చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఎంఐఎం నేత గులాం అహ్మద్ హుస్సేన్ ఇరు వర్గాలను సమన్వయపరచడంలో సఫలీకృతులయ్యారు. ఈ వివాదాన్ని ముగింపు పలకడానికి చొరవ తీసుకుని సహకరించిన ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ కు, పోలీసు శాఖకు హుదా హైస్కూల్ అధ్యక్షుడు అహ్మద్ అబ్దుల్ అజీమ్, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మిన్హాజ్ మొహియుద్దీన్, బిల్డింగ్ యజమాని మహమ్మద్ ఖలీల్ ఉర్ రహమాన్, హుదా స్కూల్ ప్రెసిడెంట్ అహ్మద్ అబ్దుల్ అజీమ్, స్కూల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



# ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



### పలు మండపాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**సత్తుపల్లి, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్)** :పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పలు వినాయక మండపాలను సందర్శించారు. పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ ప్రసన్న గణపతి స్వామివారి నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు లలితకుమారి రోడ్, 3వ వార్డు అవని వెంచర్, 5వ వార్డు కేసీఆర్ డబుల్ బెడ్రూమ్, 20వ వార్డు బైపాస్ రోడ్, 22వ వార్డు నేతాజీ రోడ్‌లలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను సండ్ర వెంకట వీరయ్య సందర్శించారు. ఆయా మండపాల్లో వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్యకు ఉత్సవ కమిటీ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.గణనాథుని ఆశీస్సులు సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని సండ్ర వెంకట వీరయ్య ఆకాంక్షించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మల్లూరి అంకంరాజు, మోరంపూడి ప్రభాకర్, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, అద్దంకి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయంలో వినాయక నిమజ్జన భద్రతా ఏర్పాట్లపై సమావేశం..

**గంగాధర సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ఈరోజు గంగాధర ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమజ్జనం రోజున తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, చెరువులు, కాలువల వద్ద చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, నిమజ్జన ప్రదేశాల్లో బారికేడ్ల ఏర్పాటు, విద్యుత్ భద్రత తదితర అంశాలపై చర్చించారు. చెరువులు, కాలువల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఎస్సై వంశీకృష్ణ సూచించారు. నిమజ్జన ప్రదేశాలను ముందుగానే పరిశీలించి ప్రమాదకరమైన లోతైన ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని




తెలిపారు. ప్రజలు నీటిలోకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, రాత్రి సమయంలో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే నిమజ్జన ప్రదేశాలకు వెళ్లే రహదారులను ముందుగానే పరిశీలించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మండప నిర్వాహకులు కూడా నిమజ్జనం సమయంలో భక్తుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు. నిమజ్జన వాహనాలపై పరిమితికి మించి ఎక్కడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రమాదకరంగా ప్రయాణించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌లను నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, ఊరేగింపు సమయంలో పోలీసుల సూచనలు పాటించాలని మండప నిర్వాహకులకు సూచించారు. సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు మండప నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని ఎస్సై వంశీకృష్ణ కోరారు. ఎంపీడీఓ రాము, తహసీల్దార్ రజిత,మండల సర్పంచ్లు, అధికారులు పాల్గొన్నారు.

# గణనాథుని వద్ద సామూహిక కుంకుమ పూజ



**జేడీ మల్లంపల్లి, సెప్టెంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కేంద్రంలోని బాలాజీ హాస్పిటల్ సమీప గణేష్ మండపంలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. పండితులు శ్రీధర్ ఆచార్యుల ఆధ్వర్యంలో లక్ష్మీ పూజ, కుంకుమార్చన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని గణపతి బప్పా నామస్మరణతో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రవిబాబు, చిట్టిరెడ్డి రాంరెడ్డి, గూడెపు రాజిరెడ్డి, గూడెపు కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేశుని నిమజ్జనం...మహా అన్నదానం



**కల్లూరు, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** శ్రీ మణికంఠ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేశుని నిమజ్జన సందర్భంగా కల్లూరు మండల పరిధిలో పడమటి లోకవరం గ్రామంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమం శ్రీ మణికంఠ గణేష్ ఉత్సవ కమిటీ, ముఖ్య అతిథులుగా హాజరైన కౌన్సిలర్ కళ్యాణపు నవ్య కొండలరావు, మాజీ గ్రామ సర్పంచ్ కళ్యాణపు కొండలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేకమైన పూజా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని దేవుని దీవెనలు చల్లగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాడ్యా వీరాలాల్ నాయక్, యస్ బ్రదర్స్ నంబూరు రాంబాబు, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాడ్య వినాయక, గుగులోతు మణికంఠ, నంబూరి భాను తేజ, శివమణి, మూడు కార్తీక్, హరిప్రసాద్, ఇస్లావత్ సంతోష్, అవినాష్, అన్వేష్, బానోతు తేజ, ఇస్లావత యశ్వంత్, భూక్య కార్తీక్, పాడ్యావరణ్ కుమార్, పాడియా మణికంఠ, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్నారు.

# మెగా ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మధ కుమార్

**ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బంగారు అవకాశం..**

**తంగడపల్లిలో మెగా ఉద్యోగ మేళా**

**50కి పైగా కంపెనీలు.3,000 కి పైగా ఉద్యోగ అవకాశాలు**

**చౌటుప్పల్ సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మునుగోడు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తంగడపల్లిలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్ల శివశంకర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మధ కుమార్




ఆవిష్కరించారు. సెప్టెంబర్ 27న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ మేళా జరగనుంది. ఇందులో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని 3,000కి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కంపెనీలు, తయారీ రంగం, బీపీఓ, సమాచార సాంకేతికతసాఫ్ట్‌వేర్, ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్, రిటైల్‌అమ్మకాలు, మార్కెటింగ్ తదితర




రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మునుగోడు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు పొందాలని ఆసరా ఫౌండేషన్ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో దోర్నాల గజేందర్, సంగీశెట్టి ధనుంజయ్, సిలివేరు విజయ్, సింగం కృష్ణ, చామల చింటూ, సిలివేరు ప్రభాస్, గంజి స్వామి మరియు తదితరులు పాల్గొన్నారు

# రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

**- మిల్లింగ్ నిలిపివేతపై ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన జిల్లా రైస్ మిల్లర్స్ ప్రతినిధులు**

**చౌటుప్పల్, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ధాన్యం మిల్లింగ్ సమయంలో ఎదురవుతున్న తరుగులు, బిల్లింగ్ ప్రక్రియలో నష్టాలు, ఎఫ్‌సీఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిల్లర్లు మాట్లాడుతూ ధాన్యం మిల్లింగ్ సమయంలో డ్యామేజ్, నూకలు, ఇతర తరుగులు సుమారు 15 నుంచి 20



శాతం వరకు వస్తున్నాయని తెలిపారు. అయితే బిల్లింగ్ సమయంలో ఈ తరుగులను సరైన విధంగా లెక్కలోకి తీసుకోకపోవడం వల్ల రైస్ మిల్లులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో ధాన్యం మిల్లింగ్ చేయడం ఆర్థికంగా భారంగా మారిందని వివరించారు. అలాగే ఎఫ్‌సీఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆర్డీవోను కోరారు. సెప్టెంబర్ 7న జరిగిన రాష్ట్ర రైస్ మిల్లర్స్ ప్రెస్‌మీట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు, యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేటి నుంచి జిల్లాలోని రైస్ మిల్లుల్లో మిల్లింగ్ కార్యక్రమాలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం మిల్లర్ల సమస్యలను పరిశీలించి, తగిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మంచిగంటి భాస్కర్, కోశాధికారి అశోక్‌తో పాటు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలి

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు ఇనుగుర్తి ప్రెస్‌క్లబ్ వినతి**

**కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ**

**ఇనుగుర్తి సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇనుగుర్తి: కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు ఇనుగుర్తి మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు విధి నిర్వహణలో భాగంగా వివిధ ప్రాంతాలకు ప్రయాణించాల్సి ఉంటుందని, రైల్వే రాయితీ పాస్‌లు పునరుద్ధరించడం వల్ల జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు వివరించారు. వినతిపై సానుకూలంగా స్పందించిన హుస్సేన్ నాయక్, జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌ల పునరుద్ధరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# నీర్నేములలో వినాయక మండపాలను దర్శించుకున్న కాంగ్రెస్ యువనేత వేముల విపుల్

**రామన్నపేట సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామంలో జాతిరత్నం యూత్, ఛత్రపతి యూత్, యాదవ్ సంఘం, సాయిరాం యూత్, గల్లీ బాయ్స్ యూత్, ఫ్రెండ్స్ యూత్, ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద కాంగ్రెస్ పార్టీ యువనేత వేముల విపుల్ సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందాలని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం యూత్ సభ్యులను, నిర్వాహకులను అభినందించారు. ఆయన వెంట యూత్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల గోడు విన్న రాజగోపాల్‌రెడ్డి.. రూ.20 లక్షలతో పిలాయిపల్లి కాల్వ ప్రక్షాళనకు శ్రీకారం

**పిలాయిపల్లి కాల్వలో గుర్రపుడెక్క తొలగింపు పనులకు శ్రీకారం.**

**రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో పనులు ప్రారంభం**

**చౌటుప్పల్ సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చౌటుప్పల్ మండల రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులపై మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. బండరావిరాల నుంచి పెద్దకాపర్తి వరకు పిలాయిపల్లి కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకులను తొలగించే పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భువనగిరి శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో, దివిస్ లేబొరేటరీస్



యాజమాన్యం సౌజన్యంతో సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.20 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. బండరావిరాల వద్ద ఇరిగేషన్ ఈఈ రాధాకృష్ణ, డీఈ కృష్ణారెడ్డితో కలిసి చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఆకుల ఇంద్రసేనారెడ్డి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. పిలాయిపల్లి కాల్వలో గుర్రపుడెక్క పూర్తిగా పేరుకుపోవడంతో కాల్వ ద్వారా నీరు సక్రమంగా రాక చౌటుప్పల్ మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార ని తెలిపారు. రైతుల సమస్యను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి, ప్రత్యేక చొరవతో దివిస్ యాజమాన్యంతో మాట్లాడి రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పూర్తయితే నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగి రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. రైతుల సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, సహకరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి, సీఎస్ఆర్ నిధులు అందించిన దివిస్ లేబొరేటరీస్ యాజమాన్యానికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# ఉడుతల సుక్కమ్మ మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య




**రామన్నపేట సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన ఉడతల శ్రీను తల్లి సుక్కమ్మ అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మునిపంపుల గ్రామానికి వెళ్లి మృతదేవానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం పల్లివాడ ఇంద్రపాలనగరం సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్ గర్దాస్ విక్రమ్ మాజీ ఎంపీటీసీ సర్పంచులు గాదె పారిజాత డోగ్గిపర్తి జానకి రాములు రేఖ యాదయ్య గ్రామ శాఖ అధ్యక్షుడు మామిళ్ల అశోక్ ఉప సర్పంచ్ తాళ్ల క్రాంతి కుమార్ నాయకులు బత్తుల వెంకన్న ఆవుల నరేందర్ మామిడి పాండు రెడ్డి మామిళ్ళ కుమార్ ఆవుల శ్రీధర్ వార్డు మెంబర్లు మేకల రాములు కోనూరు లక్ష్మమ్మ నాయకులు కాయ యాదయ్య గుండాల గణేష్ కూనూరు లింగస్వామి ఎడవెల్లి నరసింహ యాదయ్య వెంకన్న శంకర్ తదితరులు పాల్గొనడం జరిగింది



# మనకు మనమే శత్రువులం.. అవును, 100 శాతం వాస్తవం

## : శోభిత ధూళిపాళ

సమాజంలో ఒకరి ఎదుగుదలను మరొకరు ప్రోత్సహించరని, మనకు మనమే శత్రువులమని ప్రముఖ నటి శోభిత ధూళిపాళ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు మద్దతు తెలుపుతూ ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఒకరి ఎదుగుదలను మనవాళ్లే ప్రోత్సహించరు" అనే ఆ పోస్ట్‌కు బదులిస్తూ "100 శాతం వాస్తవం" అని ఆమె స్పందించారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను శోభిత గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఎటువంటి భరోసా లేకుండా ముంబైకి వెళ్లానని, రిస్క్ తీసుకుని ముందడుగు వేశానని తెలిపారు. కొత్త దారుల్లో ప్రయాణించే వారిని, పెద్ద కలలు కనే వారిని ఈ సమాజం పెద్దగా ప్రోత్సహించదని తాను గమనించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఒక రంగంలోకి కొత్తగా అడుగుపెట్టేవారికి అప్పటికే అక్కడ స్థిరపడిన వారు అరుదుగా మద్దతు ఇస్తారని, అదే మహిళల విషయానికొస్తే సవాళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలు తాను కెరీర్ ప్రారంభించిన నాటి పరిస్థితులకు సంబంధించినవని, ఇప్పుడు పరిస్థితులు మారి ఉంటాయని ఆశిస్తున్నట్లు శోభిత స్పష్టం చేశారు. సమాజంలో ఒకరికొకరు మద్దతుగా నిలవాలని, ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా ఎదిగేందుకు అవసరమైన మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. 'గూఢచారి', 'మేజర్', 'పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన శోభిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# చిరంజీవికి జోడీగా స్నేహ..?

## 'కాకా'పై భారీ అంచనాలు



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'కాకా'పై చుట్టూ ఇండస్ట్రీలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటి స్నేహ చిరంజీవికి జోడీగా భార్య పాత్రలో కనిపించనున్నారనే వార్త సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్లయిన నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణలతో పాటు చిరంజీవితోనూ నటించిన అరుదైన మైలురాయిని స్నేహ సొంతం చేసుకుంటారు.

మరోవైపు, చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడ్యూసర్లతో చిరంజీవి ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, త్వరలోనే ఫస్ట్ సింగిల్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్వా పరిశ్రమలో పనిచేసే 'కె. సత్యం' అనే సాధారణ వ్యక్తి వెనుక ఉన్న భిన్నమైన యాక్షన్ కోణంతో సాగే కథలో నటి అనశ్వర రాజన్ 'అమ్ములు పాప'గా ముఖ్య పాత్ర పోషిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ వేగంగా అడుగులు వేస్తున్నారు. ￭

# మంత్రాలయంలో ఉపాసన కొణిదెల ప్రత్యేక పూజలు



కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ భార్య ఉపాసన కొణిదెల పర్యటించారు. ఉదయాన్నే ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రాలయానికి చేరుకున్న ఆమెకు రాఘవేంద్ర స్వామివారి ఆలయ అధికారులు, పీఠం ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. మంత్రాలయం పర్యటనలో భాగంగా ఉపాసన ముందుగా స్థానిక గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామివారి మూల బృందావనాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామిని దర్శించుకోగా, ఆయన ఉపాసనకు మంత్రాలయం విశేష శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. రాఘవేంద్ర స్వామి దివ్య ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉందని ఈ సందర్భంగా ఆమె హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు, తమ అభిమాన కథానాయకుడు చరణ్ భార్య మంత్రాలయానికి వచ్చారన్న సమాచారం వ్యాపించడంతో... ఆమెను చూసేందుకు అభిమానులు, స్థానిక భక్తులు ఆలయ ప్రాంగణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంత్రాలయం మఠ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

# అమెరికాలో నాని 'ప్యారడైజ్'కు భారీ క్రేజ్..

## అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే లక్షల డాలర్లు


నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ అంచనాలను పెంచుతోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమా సృష్టిస్తున్న సంచలనం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం, ఒక రోజు ముందుగానే ప్రీమియర్ షోలతో సందడి చేయనుంది. నార్త్ అమెరికాలో ఇప్పటికే ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'ప్యారడైజ్' సరికొత్త రికార్డులు నమోదు చేస్తోంది.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌పై మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్టే ఉత్తర అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే లక్ష డాలర్ల మార్కును దాటి, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన తెలుగు చిత్రంగా రికార్డు సృష్టించింది. మధ్యలో బుకింగ్స్ కాస్త నెమ్మదించినా, విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మళ్లీ ఊపందుకున్నాయి.

తాజాగా ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లు వెల్లడించిన వివరాల ప్రకారం, నార్త్ అమెరికాలో ప్రీమియర్ల కోసం ఇప్పటివరకు 15,000కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా ప్రీ-సేల్స్ రూపంలోనే 350ఖ (సుమారు రూ. 3.35 కోట్లు) డాలర్ల వసూళ్లు దాటినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. నాని సినిమాలకు మొదటి నుంచి యూఎస్‌లో మంచి మార్కెట్ ఉండటంతో, 'ప్యారడైజ్' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఈ చిత్రంలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'ఏషనాగుల' పాట యూట్యూబ్‌లో కేవలం 17 రోజుల్లోనే 100 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఎలాంటి ట్రైలర్ లేకుండానే ఈ సినిమా నేరుగా థియేటర్లలోకి రానుంది.


సినిమాపై ఉన్న నమ్మకంతోనే చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ప్రీ-సేల్స్ మరింత పెరిగి, 'ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




# 'రణబాలి' నుంచి బిగ్ అప్డేట్..

## షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టిన మూవీ టీమ్

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' చిత్రీకరణ పూర్తయింది. గత 130 రోజులుగా నిర్విరామంగా సాగుతున్న షూటింగ్‌కు చిత్రబృందం గుమ్మడికాయ కొట్టింది. ఈ విషయాన్ని దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. తన చిత్ర బృందాన్ని 'అలుపెరుగని సైన్యం'గా అభివర్ణిస్తూ, ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. భారీ అంచనాల నడుమ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టి-సిరీస్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. విడుదలకు చాలా ముందే సినిమా సిద్ధమవుతుందని, ఇప్పటికే మొదటి భాగం నేపథ్య సంగీతం (బీజీఎం) కూడా పూర్తయిందని చిత్రబృందం తెలిపింది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్, రష్మిక కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో రష్మిక పోషిస్తున్న 'జయమ్మ' పాత్రకు తన తల్లి పేరు పెట్టుకున్నట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఇటీవల వెల్లడించారు. "రణబాలి గుండెల్లో ప్రేమగా, ఆత్మలో స్ఫూర్తిగా, వెన్నెముకలో ధైర్యంగా, అతని పిచ్చిలో మాధుర్యంగా జయమ్మ పాత్ర ఉంటుంది" అని ఆయన అభివర్ణించారు. రష్మిక తన నటనతో జయమ్మ పాత్రకు ప్రాణం పోయడమే కాకుండా ఆ పాత్రను శాశ్వతంగా నిలిచిపోయేలా చేసిందని ప్రశంసించారు.




# సరైన తోడు దొరికితే రెండో పెళ్లికి సిద్ధం

## : సీనియర్ నటి ప్రేమ

ఒకప్పటి ప్రముఖ హీరోయిన్, తెలుగు, కన్నడ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ప్రేమ తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తోడు అనేది ముఖ్యమని, తనకు నచ్చిన, తనను అర్థం చేసుకునే వ్యక్తి దొరికితే రెండో వివాహం చేసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేసింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ప్రేమ, తన పెళ్లి, విడాకుల గురించి ప్రస్తావించారు. 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పచ్చును వివాహం చేసుకున్నానని, అయితే కొంతకాలం తర్వాత అభిప్రాయ భేదాలు రావడంతో 2016లో ఫ్యామిలీ కోర్టు ద్వారా పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నామని చెప్పింది. అప్పటి నుంచి ఒంటరిగానే ఉంటున్నట్లు పేర్కొంది. రెండో పెళ్లి గురించి మాట్లాడుతూ "జీవితానికి తోడు ముఖ్యం. సరైన వ్యక్తి దొరికితే 70 ఏళ్ల వయసులోనైనా పెళ్లి చేసుకుంటాను. దీనికి వయసుతో సంబంధం లేదు. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం" అని ప్రేమ పేర్కొంది. గతంలో తన ఆరోగ్యంపై వచ్చిన వదంతులను కూడా ఆమె ఖండించింది. తనకు క్యాన్సర్ సోకిందంటూ వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో వచ్చే ప్రతీ వార్తను నమ్మవద్దని పేర్కొంది.

